
# సుపుత్ర ప్రాప్తిరస్తు...

పాలకూర సీతాలత

**వజ్జనరావుకి** కోపం వచ్చింది, పెళ్ళాంని ఇంకా కాపురానికి పంపించని మామగారిమీద. కొత్త కాపురంలోని ముచ్చటలు అతనికి అందడంలో ఆలస్యం జరిగిపోతోందని గింజుకున్నాడు. తను బాధ పడుతున్నట్టుగా తన భార్య బాధపడటంలేదా ? ఒకవేళ అలా బాధ పడుతుంటే తనైనా తెగించి తండ్రికి ఎందుకు చెప్పదు? 'నాన్నా ! నన్ను ఆయన దగ్గరకు త్వరగా పంపు' అని ఎందుకు అనదు? బహుశా సిగ్గుపడిందేమో! ఆఁ. సిగ్గా, గోంగూర పచ్చడా ? పళ్ళు నూరుకున్నాడు. కొంచెం నొప్పి పెట్టింది. 'ఇకముందు పళ్ళు నూరుకుంటే కొంచెం నెమ్మదిగా నూరుకోవాలి' అని నిర్ణయించుకున్నాడు. అందుకే తొలి ప్రయత్నంగా ఘాటుగా ఉత్తరం రాశాడు మామగారికి.

ఉత్తరం అందగానే గట్టిగా దగ్గొచ్చింది మామగారికి. 'ఇదేమిటి? ఊరగాయ రోజులు కూడా కాదు. ఎండుమిరపకాయల గొట్టులాంటి ఈ ఘాటు ఏమిటి?' అనుకున్నా డాయన. అదంతా అల్లుడు ఘాటుగా రాసిన ఉత్తరం






వల్లనే అని ఉత్తరం చదివేకా తెల్సింది.

కూతురు చంపావతిని పిలిచేడు.

"అమ్మాయ్! కాపురానికి పోతే నీ చదువు నాశనం అవుతుందని పూరుకున్నా. ఇంకొంచెం ఆగితే అతను నన్నే నాశనం చేసేలాగ ఉన్నాడు. బయలుదేరు...నీ చదువు గంగలో కల్సినా ఫర్వా లేదు— అతడు నన్ను గంగలోకి ముంచకపోతే అంతే చాలు" అని హడావుడి చేసి కూతుర్ని బయలుదేరదీశాడు.

ఒకరోజు సజ్జనరావు ఆఫీసులో ఉండగా ఫోను వచ్చింది.

"నేను వచ్చేను, బాబూ! మీ పక్కింట్లోంచి మాట్లాడుతున్నాను. ఒకసారి వస్తావా? అన్నారు మామగారు ఫోన్లో.

"మీరు ఒక్కరే వచ్చారా?" అడిగేడు కొంచెం ఆశతో.

"అబ్బే! మీ అత్తగారు కూడా వచ్చింది." అటునుంచి జవాబు.

"నా పెళ్ళాన్ని అక్కడ వదిలేసి మీ రిద్దరూ ఇక్కడి కెందుకు అఘోరించారు? హనీమూను కొచ్చేరా? లేకపోతే నా విరహతాపవు వేడి ఎన్ని డిగ్రీలో కొలవడానికి థర్మామీటరు తీసు కొచ్చేరా?" మిరపకాయల్ని తిన్నవాడిలాగ అరవాలని అనుకున్నాడు. కానీ అది ఆఫీసుకదా అని మాట్లాడలేదు.

"సరే. వస్తున్నాను" అని మాత్రం అన్నాడు.

ఇంటికి వెళ్ళి తలుపు తీశాడు. అది చూసి మామగారు, అత్తగారు వచ్చేరు.

లోపలకు వెళ్ళి చెంబులో నీళ్ళు తెచ్చాడు.

మామగారు సంతోషించి—"స్నానమూ అదీ అక్కడే అయిపోయింది, బాబూ" అన్నారు.

"ఈ నీళ్ళు అందుక్కాదు తెచ్చింది. మిమ్మల్ని నిలబెట్టి కడిగెయ్యాలని తెచ్చాను. (ఎడాపెడా లేకుండా కోపం చూపడాన్ని కడిగేయడం అని కూడా అంటారు.)

"నాక్కావల్సింది పెళ్ళాం. మీరు కాదు" అన్నాడు గట్టిగా.

ఆ అరుపుకి గది తాలూకు స్లాబ్ బీట తీసింది.

ఆ బీటను చూసి "ముందు అది బాగు చేయించుకో బాబూ! లేకపోతే వానాకాలంలో గోడ అంతా తడి అయిపోతుంది" అన్నారు మామగారు.

"హు! నా బ్రతుకే బీటలు వడింది. ఈ స్లాబ్ ఒక లెక్కా!" అన్నాడు వేదాంతంగా.

"అరె! ఎన్ని బీటలు వచ్చాయో చూపించు బాబూ, చూస్తాను. మరీ ఎక్కువ బీటలు పడితే కష్టమమ్మా!" అన్నారు ఆయన సరిగ్గా అర్థం చేసుకోక, 'బ్రతుకు' అంటే అదేదో వస్తువని అనుకొని.

"నా క్కావల్సింది పెళ్ళాం" అన్నాడు మళ్ళీ.

"బాగుంది. అందుకేకదా తీసుకువచ్చాం" అంది అత్తగారు.

"వాళ్ళింట్లోనే స్నానం చేస్తోంది. వచ్చే స్తుంది. అసలు మేం వచ్చింది ఆమెను దింప డానికే" అన్నారు మామగారు. అతనిలోని చికాకు ఎగిరిపోయింది. అది ఎగిరిపోతుండగా దాంతో అత్తగారు అంది:

"అలాగే ఎగిరి వెళ్ళిపో. తిరిగి రాకు."

ఇంతలో అతని అర్ధాంగి, ఆశల రాణి, అందాల బంతి అప్పుడే అడుగు పెట్టింది.

ఆమెను చూసి వెర్రి ఎత్తినట్లు పరిసరాలు మర్చిపోయి 'హాయ్' అన్నాడు.

"పద. మళ్ళీ అరగంటలో మరో బస్సుంది. వెళ్దాం" అన్నారు భార్యతో మామగారు.

"అదేమిటి? కొత్తకాపురం. పిల్లదానితో ఒక వారం రోజులు ఉండొద్దూ..." అంది అత్తగారు.

"వద్దు. అల్లుడు చాలా తొందరలో ఉన్నాడు. ఇక్కడ నువ్వు ఉంటే నిన్ను కొరుక్కుని తినేస్తాడు. అతడి పళ్ళు చాలా వాడిగా కూడా ఉన్నట్లున్నాయి. అతని కిప్పుడు పెళ్ళాం తప్ప ఇంకెవ్వరూ అక్క ర్లేదు" అని అతని చెయ్యి పట్టుకుని చూసి—

"చూశావా! ఇప్పటికే ఎంతో వేడెక్కిపోయి ఉన్నాడు. అందుకే పద, పోదాం" అన్నారు మామ గారు.

కూతుర్నొదిలి వెళ్ళిపోయారు.

గంటలో వచ్చేస్తానని చెప్పి వచ్చిన సజ్జన రావు ఇంక ఆ రోజుకి ఆఫీసుకి వెళ్ళలేదు.

"చంపా! నా చంపా! రా" అంటూ ఆమెను దగ్గరకు పిల్చి అన్నాళ్ళ విరహమూ ఒక్కసారే ముక్కలు అయ్యేలాగ కౌగలించు కున్నాడు.

"అబ్బా" అంటూ మూలిగి నేలమీద వెతక సాగింది చంపావతి.

"ఏమైంది?" అన్నాడు.

"ఏంలేదు. మీ ఉడుంపట్టుకి నడుం విరిగి పోయి ముక్కలైంది. ఆ ముక్కలేమైనా క్రింద పడ్డాయా అని వెతుకుతున్నాను" అంది.

ఆ మర్నాటి నుంచీ భార్యే లోకం అన్నట్లుగా ప్రవర్తించాడు. 'ఆఫీసుకి వెళ్ళరా' అని భార్య అడిగితేనే గుర్తొచ్చింది తను ఆఫీసులో పని చేస్తున్నాడని. ఆ రాత్రి భోజనాల దగ్గర సహాయం చేస్తూ వడ్డించడానికి ఒకే కంచం పెట్టాడు. భార్య ఆశ్చర్యంగా అదేమిటని ప్రశ్నించింది.

"అరె! నిన్ను చూస్తూ ఈ లోకమే మర్చి పోతున్నాను. ఇప్పుడు నన్ను నేనే మర్చిపోయాను. అందుకని భోజనం చెయ్యవలసింది నువ్వు ఒక్క దానివే అనుకున్నాను" అన్నాడు.

చంపావతి కిలకిలా నవ్వింది.

ముక్కు ఎగబీల్చి "ఆహా...ఏమి సువాసన" అన్నాడు.

"అదేమిటి? ఇంత సడన్‌గా సువాసన ఎలా వచ్చింది?" అడిగింది.

"ఇప్పుడు నువ్వు నవ్వావు కదా! ఆ నవ్వులో పువ్వులు పూచాయి. అందుకే ఈ పరిమళం" అన్నాడు.

చంపావతి ఆ తర్వాత రెండు రోజులూ చీర కొంగు అలాగే విడిచి పెట్టకుండా మొలలో దోపుకోవడం మొదలుపెట్టింది. దాంతో సజ్జన రావుకి చాలా కష్టం అయిపోయింది.

"నువ్వలా కొంగు మొలలో దోపుకుంటే ఎలాగ? నీ కొంగు పట్టుకుని తిరగడానికి నాకు వీలు కలగడం లేదు" అన్నాడు బాధగా.

"అవును—కావాలనే అలా చేస్తున్నాను. మీరు నా కొంగు పట్టుకుని వదలరని ఇరుగు పొరుగువాళ్ళు చెవులు కొరుక్కుంటున్నారు—తెలుసా? నాకు అవమానంగా ఉంది" అంది చంపావతి.

"ఎవరెవరు? మన పక్కింటి పర్వతమ్మగారు, ఎదురింటి ఎంకమ్మగారు కదూ అలా చెవులు కొరుక్కుంట?" అన్నాడు.

"అవును. మీకు ఎలా తెలుసు?"

"అది తెలుసుకోవడం పెద్ద కష్టం కాదులే. ఆ ఇద్దరి చెవుల దగ్గరా రక్తం గడ్డ కట్టుకుని ఉండటం చూశాను. అందుకే వాళ్ళిద్దరూ చెవులు కొరుక్కుని ఉండాలని అర్థం అయింది. మరీ అంత గట్టిగా కొరుక్కోవద్దని చెప్పు. రేపు పొద్దున్న ప్రమాదం కాగలదు" అన్నాడు.

సజ్జనరావు, చంపావతిలు అన్యోన్యంగా ఒకర్నొకరు ప్రేమించుకుంటూ కాలం గడుపుతున్నారు.

ఒకరోజు అతని ఆఫీసులో అతని కొక ఉత్తరం వచ్చింది. అది చూడగానే అందులో ఏదో బాంబు ఉందని అనిపించింది. అది నిజమే ఆ ఉత్తరంలో బాంబులాంటి వార్త ఉంది.

ఆ హాల్లో గడియారం లేకపోయినా అందరికీ గట్టిగా గడియారపు చప్పుడు వినిపించింది. కాన్పైతే ఆ శబ్దం టిక్. . .టిక్. . .టిక్ అని కాక లబ్ డబ్ అంది. ఎవరిదో గుండె గట్టిగా కొట్టుకుంటూందని భావించారు. అది సజ్జనరావుదే అనీ, ఏదో బాంబులాంటి వార్త వినటంవల్ల ఆ గుండె అంత గట్టిగా అరుస్తూందనీ తెలిసింది.

ఆ ఉత్తరం సజ్జనరావు తండ్రి సంగమేశ్వర రావు రాశాడు. "నాకు మీ వూరే బదిలీ అయింది. ఒక వారం రోజుల్లో వస్తాను. అందరం కలిసే ఉండొచ్చు. ఒక పెద్ద ఇల్లు చూడు ఈలోగా" అని రాశాడు. ఇప్పుడు తను, చంపావతి చిన్న పొదరిల్లులాంటి ఇంట్లో చిలుకా, గోరింకల్లాగ ఉంటున్నారు. ఇప్పుడింక ఇల్లు కిష్కింధ అయిపోతుంది. తల్లి తండ్రీ, ఇద్దరు చెల్లాయిలు, ఇద్దరు తమ్ముళ్ళు— ఇంతమందితో కలిసి జీవించాలంటే అది ఇల్లు కాదు. తనకు, చంపావతికి ఒంటరితనం దొరుకుతుందని ఆశిస్తే అది దురాశే. ఎక్కడనుంచి సరుక్కువచ్చినా ఈ సమస్యకు పరిష్కారం లేదు. తండ్రికి ఎదురు చెబితే అగ్గిమీద గుగ్గిలం అయిపోతాడు. తాము విడిగా ఉంటామని చెబితే పొడుపు మీద పెద్ద లెక్చర్ ఇస్తాడు. ఆ రోజు నవదంపతులుగా తా మిద్దరూ పాదాలకు నమస్కారం చేస్తే 'సుపుత్ర ప్రాప్తిరస్తు. . .' అంటూ గంట వాయించినంత గట్టిగా చెయ్యి ఎత్తి దీవించి అక్షింతలు చల్లాడు కానీ, ఆ దీవెన ఫలించేందుకు తగిన పరిసరాలు ఏర్పాటు చేయాలని అనుకోడు.

"ఓరి భగవంతుడా! నన్ను ఎందుకయ్యా ఇలా శిక్షిస్తావు? నేను ఏం పాపం చేశానని?" అంటూ వాపోయాడు. తండ్రి సంగతి తనకు బాగా తెలుసు. గొప్ప చండశాసనుడు. తను చెప్పింది వేదం అంటాడు. అందుకు ఎదురు తిరిగితే చీవాట్లు పెట్టేస్తాడు.

ఇంటి కెళ్ళాక చంపావతితో ఈ వార్త చెప్పాడు. ఆమె మాత్రం చాలా సంతోషించింది. "పోన్లెండి. ఎంచక్కా అందరం కలిసే ఉండవచ్చు. పాపం, అత్తగారికి ఆరోగ్యం అంత బాగుండదు. చక్కగా ఆవిడకు అనుక్షణం సేవ చేసే అవకాశం కలుగుతూంది" అంటూ బోలెడు సంబరపడిపోయింది. అది చూసి మరికాస్త చిర్రెత్తిపోయాడు.

"నీకు నా బాధ అర్థం కాదే, మొద్దుబుర్రదానా!' అంటూ తన గోడు వెళ్ళబోసుకున్నాడు.

మూతి తిప్పుకుంది. 'మీ కెప్పుడూ ఆ గోలే. తప్పు కదూ. పూజ్యులైన అత్తగారి పాదసేవా భాగ్యంలో ఈ భోగం ఎన్నో వంతు?" అంది.

"మరి పతి సేవ మాట ఏమిటి, భామామణీ?" అని వాపోయాడు. ఆమె మాట్లాడలేదు.

ఇష్టం లేకపోయినా ఇంకొక పెద్ద ఇల్లు చూడక తప్పలేదు. తనకంటూ ప్రత్యేకంగా ఒక బెడ్ రూమ్ ఉండేలా ఇల్లు చూసుకోవాలను కున్నాడు కానీ అది అంత త్వరలో దొరికేలా కనిపించలేదు. ఇటు చూస్తే తండ్రి వచ్చే రోజు దగ్గరయిపోతూంది. మరేం దారి లేక దొరికిన ఇల్లే తీసేసుకున్నాడు.

మరొక పది రోజులకల్లా అందరూ వచ్చేశారు. చెల్లాయిలకాలేజీల్లోనూ, తమ్ముళ్ళ స్కూళ్ళలోనూ చేరేసరికి తల ప్రాణం తోకకు వచ్చింది. ఆ పని అయిపోయాక ఆ తోక దగ్గర ఉన్న ప్రాణాన్ని తీసి మళ్ళీ తల దగ్గరే పెట్టేసుకున్నాడు. ఎందుకంటే, ఆ తర్వాత మళ్ళీ ఇంకో తల ప్రాణం తోకకు వచ్చే పని చెయ్యాలంటే ప్రాణం తల దగ్గర ఉండాలి కదా!

చంపావతిని చూస్తే సజ్జనరావుకి పాపం! జాలి కలుగుతూంది. ఆమె చాకిరీ ఎక్కువైంది. తీరిక తక్కువైంది. తల్లి ఎక్కువగా పని చెయ్యలేదు, అనారోగ్య కారణంగా. చెల్లాయిలకు తీరిక ఉన్నా చేలేసి ముట్టరు పని. నోట్సు రాసుకోవాలనో, చదువుకోవాలనో చెప్తుంటారు. ఆమెతో



"కర్కశంగా, గరుకుగాఉండే
పళ్ళపొడులు మీ పళ్ళకు,
చిగుళ్ళకు
హానికలిగించవచ్చు..."

TP.G.30 Tl.

కోల్గేట్ టూత్ పౌడర్‌తో మీ చిగుళ్ళను, చెడుశ్వాసను కూడా అరికట్టండి, పళ్ళను కాపాడుకోండి.




కోల్గేట్ టూత్ పౌడర్ ఎంతో మెత్తగా ఉండే తెల్లని పౌడర్. అది అతి మృదువుగా మీ చిగుళ్ళను తోముతుంది. అంతేగాకుండా దానిలో ఉండే సున్నితమైన మెరుగునిచ్చే పదార్థం మీ పళ్ళ మీది పాచిపొరలను తొలగిస్తుంది. మీ పళ్ళను శుభ్రపరచి తెల్లగా చేస్తుంది. కోల్గేట్‌లోని పుష్కలమైన నురుగునిచ్చే చర్య పళ్ళ సందులలోనికి చొచ్చుకుపోయి చెడు వాసనను దంతక్షయకారకములైన సూక్ష్మ క్రిములను తొలగిస్తుంది.

మీ కుటుంబానికి కోల్గేట్ టూత్ పౌడర్‌తో అధునాతనమైన తీరులో దంతరక్షణ సమకూర్చండి. దానియొక్క చల్లని, పిప్పర్‌మెంట్ రుచిని వారంతా మెచ్చుకుంటారు.

ఏకాంతంగా మాట్లాడాలంటే కూడా కుదరటం లేదు. రాత్రి పూట చంపావతి అత్తగారి దగ్గరే పడుకుంటుంది. ఆమెకు కాళ్ళు ఒత్తుతూనో కల పడుతూనో ఉంటుంది అస్తమానూ. భార్యాభర్త లిద్దరికీ కొంచెం ఏకాంతం అవసరమనీ, అది కల్పించవలసిన అవసరం ఎంతైనా ఉందనీ, అందుకు తాము సహకరించాలనీ ఆ తల్లిగానీ, తండ్రి గానీ అనుకోకపోవడం గొప్ప బాధాకరంగా ఉంది. తన బాధను అర్థం చేసుకునేవాళ్ళు లేరా అని వాపోయాడు.

ఒకరోజు తల్లిని తెలిసిన బంధువులింట్లో దింపి వచ్చాడు. ఆ బంధువుల ఇంట్లో ఏదో పూజ ఉంది అని పిలిస్తే, ఆ పూర్లోనే. "సాయంత్రం నేను వచ్చేస్తానురా, అబ్బాయ్. . ." అంది తల్లి అటునుంచే ఆఫీసుకి వెళ్తున్న కొడుకుతో. సరేనన్నాడు తను. ఆ తర్వాత ఆఫీసులో ఉండగా ఒక ఆలోచన వచ్చింది సజ్జనరావుకి.

ఎగిరి గంతు వేశాడు. ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయ్యాడు.

ఇప్పుడు ఇంట్లో చంపావతి ఒక్కతే ఉంటుంది. తల్లి తెలిసినవాళ్ళింటికి వెళ్ళింది. చెల్లాయిలుండరు. తమ్ముళ్ళు ఉండరు. ఇప్పుడు తమ ఇంటికి వెళ్ళిపోతే?

ఆ ఆలోచన రాగానే ఇంక సీట్లో ఉండలేక పోయాడు. హాఫ్‌డే సి.ఎల్. పడేసి ఇంటికి పరుగెత్తి వచ్చాడు. తలుపు తట్టాడు. నిద్ర కళ్ళతో తలుపు తీసింది చంపావతి.

లోపలకు వచ్చి తలుపు మూసేసి అమాంతం ఆమెను కౌగిలించుకున్నాడు.

"ఇదేమిటి? వేళకాని వేళ వచ్చారు?" అంది.

"ఇందుకే. . ." అన్నాడు ఆత్రంగా ఆమెను దగ్గరకు లాక్కుంటూ.

"ఉండండి. ముఖం కడుక్కుని వస్తాను" అంటూ అతణ్ణి విడిపించుకుని లోపలకు వెళ్ళింది.

ఇంతలో తలుపు చప్పుడైంది. టైము చూశాడు మూడయింది. ఇప్పుడు ఎవరు వచ్చి ఉంటారబ్బా అనుకుంటూ తలుపు తీశాడు.

ఎదురుగా చేతిలో పుస్తకాలతో పెద్ద చెల్లెలు. లోపలకు వస్తూ అంది "అదేమిట్రా? ఈ వేళప్పుడు ఇంట్లో ఉన్నావేం?"

ఏం చెప్పాలో తెలియలేదు. వెనుక నుంచి వచ్చిన చంపావతి అంది—

"తలనొప్పిగా ఉందని సెలవు పెట్టారట. ఇప్పుడే వచ్చారు"

చెల్లెలు మీద కొండంత కోపం వచ్చింది. ఈ టైములో శనిలాగా దాపురించిందే!

"వదినా! టీ ఇచ్చేస్తే వెళ్ళిపోతాను. మా ఫ్రెండు ఇంటికి వెళ్ళాలి" అంది చెల్లెలు.

"ఇప్పుడేవెళతావా?" అడిగాడు ఆశగాసజ్జనరావు

"అవును ముఖం కడుక్కుని, చీర మార్చుకుని వెళతాను" అంటూ ముఖం కడుక్కోవడుకు బాత్‌రూమ్‌లోకి వెళ్ళింది.

"చంపా! త్వరగా టీ పెట్టు. అది వెళ్ళి పోతుంది" అన్నాడు రహస్యం చెపుతున్నట్టు నెమ్మదిగా. సోఫాలో కూర్చుని పుస్తకం చూడ సాగాడు. చెల్లెలు తయారైంది. వదిన ఇచ్చిన టీ తాగింది.

"నేను వెళ్తాను" అంటూ ఆమె గుమ్మం దిగగానే భళ్ళున తలుపు మూశాడు.

చంపావతిని సమీపించబోతుంటే అంది—

"అసహ్యంగా పట్టపగలు ఇప్పుడేమిటండీ!"

"అవకాశం ఎప్పుడు దొరికితే అప్పుడే. నువ్వు ఏం అడ్డు చెప్పకు. నాకు కోపం తెప్పించేయ గలదు మరి" అంటూ ఆమెను ముద్దు పెట్టుకున్నాడు.

ఇంతలో మళ్ళీ తలుపు చప్పుడైంది.

నుదురు కొట్టుకున్నాడు సజ్జనరావు. మళ్ళీ ఆ రాక్షసే వచ్చింది కాబోలు. ఏదైనా మర్చి పోయిందేమో!

"ఏడిసిందిలే నువ్వు తలుపు తియ్యకు. విసుగొచ్చి అదే వెళ్ళిపోతుంది" అన్నాడు సజ్జన రావు, ఆమెను వదలకుండా.

కానీ అట్నుంచి వినబడ్డది అతని తల్లి గొంతు. "చంపా. . .తలుపు తియ్యి" అంది.

'ఇదెక్కడి అన్యాయంరా బాబూ!'అని మనసులోనే తిట్టుకుని ఆమెను విడిచిపెట్టి గదిలోకి వెళ్ళి మంచం ఎక్కేసి పడుకున్నాడు.

చంపావతి వెళ్ళి తలుపు తీసింది. తల్లి లోపలకు వచ్చింది.

"రామ రామ! ఏం ఎండలో. . ." అనుకుంటూ వచ్చి సోఫాలో కూర్చుంది. చంపావతి వచ్చి మంచినీళ్ళు ఇచ్చింది.

లోపలకు వెళ్ళి కొడుకును చూసి "ఎందు కొచ్చేశాడు?" అని అడిగింది. ఆడపడుచుకు ఇచ్చిన జవాబే ఇచ్చింది అత్తగారికి.

సజ్జనరావు మాత్రం దిండులో ముఖం దూర్చుకుని 'సాయంత్రందాకా రానని చెప్పిన అమ్మ ఇప్పుడే ఎందుకు వచ్చేసిందీ, తన ఖర్మ కాకపోతే. ఇక ఈ రోజుకి ఇంతే సంగతులు—తన సెలవు వేస్ట్' అని బాధ పడిపోయాడు.




"వాడికి కాస్త వేడిగా టీ ఇయ్యలేకపోయావా?" అంది తల్లి కోడలితో.

"ఇచ్చాను, అత్తయ్యా! అది తాగాకనే పడుకున్నారు. నిద్రపట్టింది కాబోలు" అంది చంపావతి.

"అమ్మా! నాకు కావలసింది టీ కాదే. . . నీ కోడలే" అనుకున్నాడు. ఇంతలో ఆలోచన వచ్చింది.

'నాలుగు రోజులు సెలవు పెట్టి భార్యతో సహా అత్తగారి వూరు వెళ్ళితే అవును. అలాగే చెయ్యాలి. ఆ విషయం అప్పుడే ఎవరికీ చెప్ప కూడదు. ఏ అడ్డంకులయినా వచ్చినా రాగలవు.'

ఆ మరునాడు ఆఫీసుకి వెళ్ళినప్పుడు వారం రోజులు సెలవు పడేశాడు. బ్యాంకులో నుంచి డబ్బు తీశాడు. సాయంత్రం ఆ విషయం ఇంట్లో చెప్పి రాత్రి సామాను సర్దుకుని, రేపు ఉదయానికల్లా భార్యతో వెళ్ళిపోవాలి.

హుషారుగా ఇల్లు చేరాడు.

భార్యకు మల్లెపూల పొట్లాం అందించాడు.

ముఖం కడుక్కుని పెట్టుకోవాలనే ఉద్దేశంతో పూల పొట్లం అక్కడే బల్లపైన ఉంచి భర్తకు కాఫీ తేవడానికి లోపలకు వెళ్ళింది చంపావతి. ఇంతలో అతడి చిన్న చెల్లెలు ఆ పొట్లం చూసి 'అరె. . .అన్నయ్య నాకోసం పువ్వులు తెచ్చాడే' అంటూ వాటిని తాను ధరించింది. అది చూసి సజ్జనరావు ముఖం ముడుచుకున్నాడు.

అది తెలిసిన చంపావతి కాఫీ ఇస్తూ భర్తతో నెమ్మదిగా అంది—"బాగా ముడుచుకోవడంవల్ల మీ ముఖం చిన్నదైంది. అలా అయితే కాఫీ తాగడం కష్టం. అయినా ఇంట్లో ఇందరు ఆడవాళ్ళు ఉన్నప్పుడు పూలు అందరికీ తేవద్దూ?" మెత్తగా చివాట్లు పెట్టింది. ఆ తర్వాత భార్యతో ఆ మరునాడు వూరికి వెళ్ళుతున్న సంగతి చెప్పాడు.

"అదెలా కుదురుతుంది? ఇప్పుడే ఉత్తరం వచ్చింది. అమ్మావాళ్ళు నన్ను చూడడానికి రేపే బయలుదేరి వస్తున్నారట. ఒక వారం రోజులు ఉంటారట" అంది.

27—7—83

'హతోస్మి! తన ఖర్మ ఇలా కాలిపోతూందేమిటి?' బాధపడిపోయాడు.

సెలవు కాన్సిల్ చేసుకుని డ్యూటీకి వెళ్ళిపోయాడు.

సజ్జనరావుకి మాత్రం నిప్పు తొక్కినట్లు ఉంది. అతనికి కావలసింది ఒక్కటే. ఏకాంతం! కానీ అది దొరకదు— ఇలాగే రోజులు గడిస్తే పిచ్చి ఎక్కిపోతుందేమో అనిపించింది. ఒక వారం గడిచింది. చంపావతి అడిగింది—

"ఇదేమిటి? మీ చెవులు తడిగా ఉన్నాయి?"

"అదా! చెవుల్లో అమృతం పోసే వార్త చెప్పాడులే నాన్న. ఆ తడి అంతా అమృతం తడి" అన్నాడు.

విషయం ఏమిటంటే వివరంగా చెప్పాడు.

సంగమేశ్వరరావుగారి అన్న కూతురు పెళ్ళి నిశ్చయం అయింది. మరొక పది రోజుల్లో జరుగుతుంది. వాళ్ళింట్లో అదే ఆఖరు పెళ్ళి కనుక అందరినీ బయలుదేరి నాలుగు రోజులు ముందుగానే రమ్మని రాశాడు. అందరూ బయలుదేరుతున్నారు. 'నువ్వు కూడా రా' అని తండ్రి అడిగితే సెలవు దొరకదని బుకాయించాడు సజ్జనరావు. ఈ వంకతో కుటుంబం అంతా పెళ్ళికి పోతే తను, భార్య కలిసి హాయిగా ఉండవచ్చునన్నదే అతని ఉద్దేశం.

"నేను, మీ కోడలు ఉండిపోతాం. మీరంతా వెళ్ళి రండి నాన్నా!" అన్నాడు.

ఒప్పుకున్నాడు తండ్రి. అదే అతని చెవుల్లో అమృతం పోసిన వార్త.

"దేవతలు దీవించారు. మన రొట్టె విరిగి నేతిలో పడింది. ఇక ఈ ప్రేమ సామ్రాజ్యంలో నేను రాణి, నువ్వు రాజా.. .ఛీ ఛీ. . .తప్పు చెప్పాను కదూ. నేను రాజా, నువ్వు రాణి" అన్నాడు సజ్జనరావు.

వాళ్ళంతా వూరికి వెళ్ళే రోజుకోసం కళ్ళలో వత్తులు వేసుకుని చూస్తున్నాడు.

ఆ రాత్రి పడుకునే ముందు నైట్ బల్బు వేసినా మామూలు 60 కాండిల్సు బల్బు వేసినంత కాంతిగా ఉంది. అంత వెలుగులో చంపావతికి నిద్దర రాదు. అందుకే భర్తతో అంది—

"ఆ కళ్ళలో వేసుకున్న వత్తులు ఆర్పేయండి. మరీ కాంతి ఎక్కువగా ఉంది. నిద్ర రావటం లేదు. కావాలంటే పగటి పూట వేసుకుందురు."

తండ్రి కూడా అడిగాడు— "కళ్ళలో ఆ వత్తులు ఏమిటిరా? దేనికోసం ఎదురు చూస్తున్నావు?" సిగ్గుపడి చెప్పలేదు.

ఆ మరునాడు ఆఫీసులో కొల్లీగ్ అడిగాడు—


"ఏమిట్రా? నీకు అస్సలు నేలమీద కాళ్ళు ఆనటం లేదు?"

చూసుకున్నాడు సజ్జనరావు. నిజమే. తన కాళ్ళు భూమికి అడుగు ఎత్తులో ఉన్నాయి.

"అదంతా సంతోషంలే బ్రదర్" అని చెప్పాడు.

ఆ రోజు సాయంత్రం భార్యతో—

"పద చంపా! వెళ్ళి కూరలు తెద్దాం" అన్నాడు




ఆ వంకతో కాస్త బజార్లో భార్యతో కలిసి తిరగవచ్చని.

"ఎందుకురా ఇప్పుడు అనవసరంగా? నేను తీసుకునే వచ్చానులే కూరలు" అన్నాడు తండ్రి.

"పోనీ, ఇంకా వేరేసరుకులు ఏమైనా కావాలేమో? అన్నాడు ఆశ చావక.

"అబ్బే! అక్కర్లేదురా అబ్బాయ్.' అంది తల్లి.

నుదురు కొట్టుకున్నాడు. తన లాంటి పిరికి వెధవలకు పెళ్ళాం ఉండకూడదు. లేకపోతే ఏమిటి? ధైర్యంగా ఏ పనీ లేకపోయినా "కాస్సేపు అలా తిరిగి వస్తాం" అని ఎందుకు బయలుదేర లేకపోతున్నాడు?

తన పిరికితనం భార్య గుర్తించలేదు కనక తల ఎత్తుకు తిరుగుతున్నాడు.

వాళ్ళందరూ పెళ్ళికి వెళ్ళే రోజు రానే వచ్చింది.

"ఈ సాయంత్రమే రైల్లో వెళుతున్నాంరా అబ్బాయ్" అన్నాడు తండ్రి.

మనసులోనే బోలెడు సంతోషపడిపోయి "సరే, నేను ఆఫీసు నుంచి అటు స్టేషన్‌కు వస్తాను అంటూ ఆఫీసుకు వెళ్ళిపోయాడు. 'అమ్మయ్య! ఒక వారం రోజులు ఆట విడుపు. ఇంట్లో తనూ చంపా ఆహా! గొప్ప చాన్సు.

సాయంత్రం తిన్నగా స్టేషన్‌కు వెళ్ళాడు.

తల్లి, తండ్రి, చెల్లాయిలు, తమ్ముళ్ళు, భార్య హడావుడిగా కంపార్టుమెంటులో సామాన్లు సర్దుతూ కూర్చున్నారు.

తను ప్లాట్‌ఫారం మీదే నిలుచుని కిటికీకి ఆనుకుని మాట్లాడుతున్నాడు. చంపావతి మంచి పనే చేసింది. రైలు వెళ్ళిపోయాక తామిద్దరూ ఇక్కడి నుంచే షికారుకి పోవచ్చు. మళ్ళీ ఇంటికి వెళ్ళి ఆమెను తీసుకు వచ్చే అవసరం తప్పింది. తనుకూడా అదే ఉద్దేశంతో బయలుదేరింది కాబోలు. ప్లాట్‌ఫారం మీదకు వచ్చి నిల్చోక రైల్లో సీట్లో కూర్చుందేం? ఆఁ! ఇంకా టైముంది కదా. కూర్చోనివ్వు.

"అబ్బాయికి కోడలు విషయం చెప్పారా?" అంది తల్లి.

"ఆఁ! మరిచి పోయానురా! కోడల్నికూడా మాతో తీసుకువెళ్తున్నాం. తీసుకువెళ్ళే ఉద్దేశం ముందు లేదు కాని అన్నయ్య రాసిన ఉత్తరం పొద్దున్న నువ్వు ఆఫీసుకు వెళ్ళాకా అందింది. వాళ్ళ పిల్లలు నీ పెళ్ళికి రాలేకపోయారు కదా! అందుకని కోడలు పిల్లన చూడలేదు. కనక ఆమెను తీసుకుని తప్పకుండా రమ్మని ఉత్తరం రాశాడు. అందుకే ఆమెనుకూడా బయలుదేరదీశాను. అన్నాడు తండ్రి.

సజ్జనరావు కళ్ళు బైర్లు కమ్మాయి. మెదడు మొద్దు బారింది. రెప్పపాటు మరిచిపోయిన వాడిలా అలాగే చూస్తూండి పోయాడు.

"అవును. నీకు భోజనానికి ఇబ్బంది అవుతుంది అనుకో. కానీ ఎంత? ఒక వారం రోజులు ఎలాగో ఎడ్జస్టు చేసుకో అన్నాడు తండ్రి.

'భోజనం గురించి కాదు, నాన్నా నా ఇబ్బంది మరొకటి అనుకున్నాడు కసిగా.

"నువ్వు కూడా వస్తే బాగుండేది. అన్నాడు తండ్రి మళ్ళీ.

'నేను ఏ ఆశతో రాకూడదని అనుకున్నానో, ఆ ఆశ నాశనం చేశావు నాన్నా! నీది హృదయం కాదు. బండరాయి. నీకు ఆలోచన లేదు. కొత్తగా పెళ్ళయిన కొడుక్కి ఏం కావాలో నీకు తెలియదు. వాళ్ళెవరో చూడాలని నా పెళ్ళాన్నినాకు కాకుండా చేస్తున్నావు. నా ఉసురు నీకు తగిలి తీరుతుంది నాన్నా! 'పుత్రప్రాప్తిరస్తు' అని దీవిస్తే చాలదు. అందుకు అవకాశం కల్పించాలి నాన్నా అని అనుకున్నాడు. జుట్టు పీక్కోబోయి, క్రాపింగు పాడై పోతుందని వూరుకున్నాడు.

చంపావతి వైపు చూశాడు. ఆమె బేలగా అతని వైపు చూసింది. ఆ కళ్ళలో అతని పై జాలి. అతని సాహచర్యం కోసం ఆరాటం. 'నేను మాత్రం ఏం చెయ్యను చెప్పండి? వెళ్ళడం నాకూ ఇష్టం లేదు. అన్న భావమూ తొంగి చూశాయి.

అర్ద్రమైన ఆ కళ్ళతో ఇక అతన్ని చూడలేక కాబోలు తల దించుకుంది.

రైలు పెద్దగా అరిచి బయలు దేరింది.

చంపావతి కిటికీలోంచి అతణ్ణి చూస్తూ చెయ్యి వూపింది.

సజ్జనరావుకూడా అలాగే చెయ్యి వూపుతున్నాడు. ఆ వెళుతున్న రైలును ఆపెయ్యాలని అనిపించింది. కానీ అలా చెయ్యలేక చెయ్యి వూపుతున్నాడు, రైలు ప్లాట్‌ఫారం విడిచి పెట్టేసినా. *